సాక్షి అనంతపురం

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.45

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.45 పలికింది. కనిష్టం రూ.27, సరాసరి రూ.36 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.8°/23.2°

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

సూర్యనారాయణ కుటుంబాన్ని ఆదుకుంటాం



సూర్యనారాయణ భార్య కుమ్మర ఈశ్వరమ్మకు చెక్కు అందజేస్తున్న జేసీ

పామిడి: రైతు కుమ్మర సూర్యనారాయణ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. సాగు చేసుకుంటున్న భూమికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరులో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వెళ్లిన రైతు సూర్యనారాయణ పురుగుల మందుల తాగారు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో బుధవారం జేసీ శివనారాయణశర్మ పామిడి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సూర్యనారాయణ భార్య కుమ్మర ఈశ్వరమ్మ మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయామని, ఇకపై తాము ఎలా బతకాలంటూ జేసీ ఎదుట వాపోయారు. జేసీ మాట్లాడుతూ సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూ. లక్ష చెక్కును అందజేశారు. జేసీ వెంట ఆర్డీఓ జీ. వసంతబాబు, తహసీల్దార్ ఎన్. శ్రీధర్‌మూర్తి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రికార్డు రూములను నవీకరించండి

రాప్తాడు రూరల్: తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డు రూములను అక్టోబర్ 2 లోపు నవీకరించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. అనంతపురంలోని ఆర్డీఓ, అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలను బుధవారం ఆయన పరిశీలించి, ఉద్యోగులతో మాట్లాడారు. రికార్డు రూములను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి రికార్డును క్రమపద్ధతిలో అమర్చి వాటి వివరాలు తెలిసేలా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. రికార్డు గదికి సంబంధించి రిజిస్టర్ తప్పక నిర్వహించాలన్నారు. కార్యాలయాల్లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా ఏర్పాటు చేయాలన్నారు. అక్టోబర్ 2 నుంచి ప్రతి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ అందే హరికుమార్, సిబ్బంది ఉన్నారు.

టెక్నాలజీతో సులభంగా సాగు



పంట పొలాలను పరిశీలిస్తున్న ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ పంజాబ్ సింగ్

కుందుర్పి: వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన నూతన టెక్నాలజీతో సులభంగా పంటలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ మాజీ కార్యదర్శి, ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ పంజాబ్ సింగ్ రైతులకు సూచించారు. ఐసీఏఆర్, సీఆర్ఐడీఏ ప్రాజెక్టులకు చెందిన ఏడుగురు సభ్యుల జాతీయ బృందం బుధవారం మండలంలోని తాతయ్యదొడ్డి గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. టెక్నాలజీపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. దీంతో సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ డీడీజీ, ఐసీఏఆర్ మాజీ వీసీ అనిల్ కుమార్ సింగ్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సంతాన్ కుమార్ బాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

కళ్యాణదుర్గం రూరల్: ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచించారు. కళ్యాణదుర్గం మండలం హులికల్లు గ్రామ రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ మాట్లాడుతూ.. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులు తప్పకుండా ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాల కింద ప్రభుత్వం 80 శాతం రాయితీతో ఇస్తున్న ఉలవలను తీసుకెళ్లి సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ యల్లప్ప, సెరికల్చర్ అధికారి ఫిరోజ్‌బాషా, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మానవ మృగాలే!

- భీతి గొల్పుతున్న కందుకూరు శివారెడ్డి హత్య కేసు ముద్దాయిల నేరచరిత్ర
- గతంలో నాలుగు హత్యలు, ఇతర కేసుల్లో నిందితులు
- ప్రేమ పేరుతో బాలికను వంచించిన ఓ ముద్దాయి
- 15 రోజుల పాటు ఇతర ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం
- అవమానంగా భావించి బాధితురాలి ఆత్మహత్య
- అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ కేసును నీరుగార్చేలా ఒత్తిళ్లు
- పుట్టిన రోజు నాడు కొడవలితో కేక్ కట్ చేసిన ఓ నిందితుడు
- వెలుగులోకి రాని ఆగడాలెన్నో..
- చీడ పురుగులకు తగిన శాస్తి జరిగిందంటున్న ప్రజలు





తన పుట్టిన రోజు వేడుకలో కొడవలితో కేక్ కట్ చేస్తున్న నిందితుడు (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత శివారెడ్డి దారుణ హత్య కేసులో ఇటీవల న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఏడుగురు నిందితులకు రెండు జీవితకాలాల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించడం జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో ముద్దాయిల నేపథ్యం ఏంటనే అంశంపై ప్రజల మధ్య చర్చకు తెరలేచింది.

పాపాలకు తగిన శాస్తి..!

శివారెడ్డిని దారుణంగా హతమార్చిన ముద్దాయిల గురించి ఆరా తీస్తే పలు భయంకర విషయాలు తెలిశాయి. ముద్దాయిలపై గతంలోనే నాలుగు హత్య కేసులు, మానభంగం, బాంబుల కేసులు ఉన్నాయి. ఒక నిందితుడిపై పోక్సో కేసు కూడా నమోదైంది. ఇవి కాకుండా పోలీసు రికార్డులకెక్కని, వెలుగులోకి రాని ఆగడాలు చాలా ఉన్నట్లు తెలిసింది. నిత్యం దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడే వారని చెబుతున్నారు. వీరి బాధితులు అనంతపురం రూరల్ మండలంతో పాటు ఆత్మకూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో ఉన్నట్లు సమాచారం. ముద్దాయిల క్రూర మనస్తత్వం తెలిసిన పలువురు వారు మానవ మృగాలంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాజానికి చీడ పురుగుల్లాంటి వారికి సరైన శిక్ష పడిందంటున్నారు. వారి పాపాలకు తగిన శాస్తి జరిగిందంటున్నారు.

కొడవలితో కేక్ కటింగ్

ఈ కేసులో మైనర్లుగా ఉన్న ఇద్దరిలో ఒకడు తన పుట్టిన రోజు సందర్భంగా కొన్ని రోజుల క్రితం స్నేహితులతో కలిసి కేక్ కటింగ్ చేశాడు. అయితే కొడవలితో కేక్ కట్ చేయడమే కాకుండా దాన్ని రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం కలకలం రేపింది. ఇలాంటి చర్యలతో సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ప్రేమ పేరుతో బాలికను బలిగొని..

కేసులో ఏ-4 ముద్దాయి అశోక్ గతంలో ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వంచించాడని గ్రామస్తులు చెబుతున్నారు. 15 రోజుల పాటు ఆ బాలికను ఇతర ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. ఊరికి వచ్చిన తర్వాత తీవ్ర అవమానానికి గురైన బాలిక ఊజిమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆ సమయంలో అధికారంలో ఉన్న తెలుగు దేశం పార్టీకి చెందిన ఓ కీలక నేత దుప్పటి పంచాయితీ చేసి ఈ కేసును నీరు గార్చారు. చివరకు కడుపునొప్పి కారణంగా బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేయించి చేతులు దులుపుకొన్నట్లు ఇప్పటికీ ఆత్మకూరు మండలంలో చర్చ జరుగుతోంది.

రౌడీలకు టీడీపీ అండ

నిందితులందరూ రౌడీషీటర్లే. కరుడు కట్టిన నేరస్తులు. ఇలాంటి వారికి టీడీపీ దన్నుగా నిలవడం పట్ల జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలొస్తున్నాయి. మంచి చేయకపోయినా పర్వాలేదు సమాజానికి పెను ప్రమాదంగా మారిన నిందితులకు కొమ్ము కాయడం పట్ల మండిపడుతున్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ నేతల ఆలోచనల్లో మార్పు రావాలంటున్నారు.

చట్టం నుంచి తప్పించుకోలేరు



బాధితులు ధైర్యంగా నిలబడి కోర్టులో వారికి జరిగిన అన్యాయాన్ని చెప్పగలిగితే, ముద్దాయిలు ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. శిక్ష పడిన తర్వాత నేరస్తులు వాళ్ల భార్య, పిల్లలు, కుటుంబాల గురించి ఆలోచిస్తే ప్రయోజనం లేదు. నేరం చేసే ముందు ఆలోచిస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదనేది తెలుసుకుంటే మంచిది. రాజకీయ నాయకులు స్వార్థం కోసం ఇలాంటి వారిని పావులుగా వాడుకుంటారనే నగ్న సత్యాన్ని పేదలు గ్రహించాలి.

– రాచమల్లు హరినాథరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టు

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ శిక్ష

అనంతపురం: హత్య కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడింది. ఈ మేరకు ఏడో అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి టి. హరిత బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురం రుద్రంపేటకు చెందిన మొలక దేవేంద్ర, భార్య లక్ష్మీదేవి స్థానిక సవేరా ఆస్పత్రిలో వార్డు బాయ్, ఆయాగా పనిచేస్తుండేవారు. వీరి ఇంటి పక్కనే లక్ష్మీనారాయణ కుటుంబం నివాసం ఉండేది. గతంలో లక్ష్మీనారాయణ భార్యను దేవేంద్ర దుర్భాషలాడాడు. దీన్ని మనసులో పెట్టుకున్న లక్ష్మీ నారాయణ 2021 నవంబర్ 11వ తేదీ ఉదయం దేవేంద్ర ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. నిన్ను చంపితే గానీ నాకు మనశ్శాంతి ఉండదు అంటూ దేవేంద్రను కింద పడేసి కొట్టడం ప్రారంభించాడు. అడ్డుకోబోయిన భార్య లక్ష్మీదేవిని పక్కకు తోసేశాడు. అక్కడే ఉన్న పునాదిరాయి తీసుకుని దేవేంద్ర తలపై అతి కిరాతకంగా మోదాడు. దీంతో దేవేంద్ర అక్కడికక్కడే తీవ్ర రక్తస్రావంతో చనిపోయాడు. ఈ క్రమంలోనే చుట్టుపక్కల వారు రాగా లక్ష్మీనారాయణ పారిపోయాడు. దీనిపై లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు అప్పట్లో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లక్ష్మీనారాయణని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసులో ప్రత్యక్ష సాక్షులతో పాటు 10 మంది సాక్షులను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. నాగరాజు బాబు విచారించారు. కేసు పూర్వాపరాలు, ఇరు వర్గాల వాదనలు పరిశీలించిన జడ్జి టి. హరిత ముద్దాయిపై హత్యా నేరం రుజువు కావడంతో బుధవారం యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్ష పడేలా చేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. నాగరాజు బాబు, కోర్టు మానిటరింగ్ అధికారి, ఏఎస్ఐ సునీల్ కుమార్, కోర్టు లైజెనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు (ఏఎస్ఐ), నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి, కానిస్టేబుల్ కుళ్లాయప్పను జిల్లా ఎస్పీ పి. జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు. వీరందరికీ ప్రోత్సాహక రివార్డులు మంజూరు చేయాల్సిందిగా డీఎస్పీ వి. శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు.

48 వేల హెక్టార్లు.. 33 వేల మంది రైతులు

- రాయితీ డ్రిప్, స్ప్రింక్లర్లకు భారీ డిమాండ్
- కేటాయింపులతోనే సరిపెట్టిన సర్కారు



డ్రిప్ ద్వారా టమాట సాగు

అనంతపురం అగ్రికల్చర్: రాయితీ డ్రిప్, స్ప్రింక్లర్లకు భారీ డిమాండ్ నెలకొంది. 48 వేల హెక్టార్లకు 33 వేల మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలలోపే రాయితీతో రైతులకు 37,500 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇస్తామని ప్రకటించింది. దీంతో సంబరపడిపోయిన అన్నదాతలు రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే)కు ఎగబడి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. సర్కారు కేటాయింపులకు మించి.. 48 వేల హెక్టార్లకు పరికరాలు కావాలని 33 వేల మందికి పైగా రైతులు దరఖాస్తులు అందజేశారు.

ఎప్పటికందేనో...?

పేరుకే భారీ కేటాయింపులు చేసిన సర్కారు ఆ తర్వాతి ప్రక్రియ గురించి పట్టించుకోవడం లేదు. రైతు రిజిస్ట్రేషన్ల ఆధారంగా అర్హత ఉందా లేదా అనే దానిపై క్షేత్రస్థాయిలో ప్రాథమిక పరిశీలన చేయాలి, తర్వాత బెంచ్ మార్క్ సర్వే (బీఎంసీ), ఆ తర్వాత బిల్ ఆఫ్ క్వాంటిటీ (బీవోక్యూ) చేయాలి. అనంతరం రైతు తన వాటాను డిజిటల్ పద్ధతిలో చెల్లించాలి. ఆ తర్వాత కలెక్టర్‌కు ఫైలు పంపాలి. అక్కడి నుంచి అనుమతులు వచ్చిన తర్వాత మంజూరు ప్రక్రియ మొదలవుతుంది. ఎంపిక చేసిన కంపెనీ నుంచి మెటీరియల్ సరఫరా అనేది కూడా ఆలస్యమవుతుంది. మెటీరియల్ సరఫరా చేసిన తర్వాత కంపెనీ ప్రతినిధులు, ఎంఐఏఓలు సంయుక్తంగా పొలాల్లో పరికరాలు ఇన్‌స్టలేషన్ చేసి ట్రయల్‌రన్ చూపించాల్సి ఉంటుంది. వచ్చే 100 రోజుల్లో కనీసం 7,200 హెక్టార్లకు పరికరాలు పంపిణీ చేయాలని ఇటీవల కార్యాచరణ రూపొందించినా ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు మరికొన్ని రోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతుల పెదవివిరుపు..

చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు ఏర్పాటై వంద రోజులు పూర్తయింది. వ్యవసాయ అనుబంధ రంగాల పురోగతి, రైతుల కష్టనష్టాల గురించి కనీస ఆలోచన చేయని పరిస్థితి నెలకొంది. రైతుకు అందాల్సిన ప్రయోజనాలు, ప్రభుత్వ ఫలాల గురించి పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు. అన్నీ కాగితాల్లో కనిపిస్తున్నా ఆచరణలో రిక్తహస్తం చూపిస్తున్నారు. పెట్టుబడి సాయం, బీమా పరిహారం ఇవ్వకుండా మోసం చేస్తున్న ప్రభుత్వం.. సూక్ష్మసాగు పరికరాలు మంజూరు చేయడంలోనూ అలసత్వం వహించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్‌కు జిల్లా జట్టు



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలోకానూరులోని అనుమోలు ప్రభాకర్ గ్రౌండ్స్‌లో సీనియర్ మహిళల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. పూల్- ఏ లో అనంతపురం, శ్రీకాకుళం, అనకాపల్లి, పూల్ - బీ లో శ్రీసత్యసాయి, తూర్పు గోదావరి, నంద్యాల, పూల్ - సీ లో వైఎస్సార్, పల్నాడు, అన్నమయ్య, పూల్ - డీ లో కర్నూలు, నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల జట్లు లీగ్ దశలో పోటీ పడ్డాయి. రెండో రోజు బుధవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లలో పూల్ - ఏ, బీ, సీల నుంచి గరిష్టంగా ఆరు పాయింట్లతో అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, పూల్ - డీ నుంచి నాలుగు పాయింట్లతో కర్నూలు జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీస్‌లో వైఎస్సార్ - అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. ఈ మ్యాచ్‌లో 2-0 గోల్స్ తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టును అనంతపురం జట్టు ఓడించి ఫైనల్‌కు చేరింది.

పోటీతత్వంతో పీఎంశ్రీ అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పోటీతత్వంతో పీఎం శ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని అమలు చేసి దేశంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,741 పాఠశాలలు ఉండగా పీఎంశ్రీ కింద 42 పాఠశాలలు గుర్తించామన్నారు. ఆయా పాఠశాలల్లో నిర్దేశించిన 21 రకాల వసతులు కల్పించాలన్నారు. దేశంలోని 700 జిల్లాలతో మన జిల్లా పోటీపడాలన్నారు. ఏ స్థాయి ప్రమాణాలతో పని చేస్తే జిల్లాను మొదటి స్థానంలో నిలపవచ్చనే దానిపై అందరూ ఆలోచించాలని సూచించారు. ఉపాధి పథకం కింద ఆటస్థలాల్లో రాళ్లను తొలగించాలని డ్వామా పీడీని ఆదేశించారు. అన్ని చోట్ల సోలార్ పవర్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈని ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓకి చెప్పారు. డీఎఫ్ఓ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల స్థాయిలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారికి సూచించారు. అన్ని చోట్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ కార్యకలాపాలు చేపట్టాలని డీఈఓని ఆదేశించారు. బాధ్యతలు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, డీఈఓ వరలక్ష్మి, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీసీఓ మురళీకృష్ణ, డీవీఈఓ వెంకటరమణనాయక్, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్ విస్తృతంగా చేపట్టాలి

పోషణ్ అభియాన్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ్ అభియాన్ కార్యక్రమాలను ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లడం, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం, ఎగ్జిబిషన్ల ఏర్పాటు, సీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు వంటివి నిర్వహించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం

బాధితులకు రూ.10 లక్షల పరిహారం

- జిల్లా వినియోగదారుల న్యాయస్థానం తీర్పు



అనంతపురం: వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఓ వ్యక్తిని బలిగొంది. దీనిపై బాధితులు జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసును క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయస్థానం.. బాధితులకు రూ.10 లక్షల పరిహారం అందించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆదేశించింది. వివరాలు.. నగరానికి చెందిన ఐ. అనిల్ కుమార్ (38)కు 2018 నవంబర్ 20న తీవ్రంగా వాంతులయ్యాయి. దీంతో కుటుంబీకులు బెంగళూరులోని సీఎంఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అనిల్‌కు మూత్రపిండాల సమస్య ఉందని చెప్పి ఆపరేషన్ చేశారు. ఇది జరిగిన రెండేళ్ల తర్వాత అనిల్ కుమార్‌కు కుడి కాలిలో నొప్పి రాగా, కుటుంబీకులు మళ్లీ అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, తమ ఆస్పత్రిని కోవిడ్ చికిత్సల కోసం కేటాయించారని చెప్పిన ఆస్పత్రి యాజమాన్యం.. తమకు అనుబంధంగా ఉన్న మరో ఆసుపత్రిలో అనిల్‌ను చేర్పించింది. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు రోగికి హృదయ సంబంధిత సమస్య ఉందని చెప్పి ఎంఆర్ఐ స్కానింగ్ చేయగా.. మూత్రపిండంలో స్టంట్ ఉన్నట్లు తెలిసింది. గతంలో ఆపరేషన్ చేసిన వైద్యులు స్టంట్‌ను అలాగే వదిలేసినట్లు గుర్తించారు. 2020 నవంబర్ 6న దాన్ని తొలగించి అనిల్‌ను ఇంటికి పంపారు. ఈ క్రమంలో కొన్నాళ్లకే ఆరోగ్య పరిస్థితి విషమించి అనిల్ మృతి చెందగా.. ఆయన మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి కుటుంబీకులు బెంగళూరు సీఎంఐ ఆస్పత్రికి లీగల్ నోటీసులు పంపారు. స్పందన రాకపోవడంతో జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సేవాలోపానికి రూ.75 లక్షలు, వైద్య ఖర్చులు రూ.20 లక్షలు మొత్తం రూ.95 లక్షలు చెల్లించాలని కోరారు. వాదోపవాదనల అనంతరం జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు ఎం. శ్రీలత, సభ్యులు డి. గ్రేస్ మేరీ, బి. గోపీనాథ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. ఆస్టర్ సీఎంఐ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఐఆర్ రవీష్‌ను బాధ్యులుగా న్యాయస్థానం పేర్కొంది. సేవా లోపానికి రూ.10 లక్షలు, మనోవేదనకు రూ.20 వేలు, ఖర్చులకు రూ.5 వేలు బాధితులకు చెల్లించాలని ఆదేశించింది.

రైతులను ఆదుకోని ప్రభుత్వమిది

- ప్రతిపక్షంలో విద్యుత్ మీటర్లు వ్యతిరేకించి.. నేడు సమర్థిస్తారా?
- కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ధర్నా
- దసరాలోపు బీమా ప్రకటించాలని అల్టిమేటం
- లేకుంటే చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరిక



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

అనంతపురం అర్బన్: పంటలు నష్టపోయి కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. దసరా పండుగ లోపు 2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించకపోతే చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులకు పెట్టుబడి సాయం, బీమా ప్రకటించాలని, విద్యుత్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించాలంటూ బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు, రైతులు సంఘమేష్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చంద్రశేఖరెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కనీసంగా కూడా రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు అమలు చేయకపోవడం ద్రోహం చేయడమేనన్నారు. అనావృష్టి కారణంగా 2023 ఖరీఫ్, రబీలో పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయాన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకించిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి తలొగ్గి మీటర్ల ఏర్పాటుకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. రైతుల డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుమ్మర సూర్యానాయణకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, రైతు సంఘం నాయకులు శివారెడ్డి, విరూపాక్షి, రాజారామ్‌రెడ్డి, చెన్నారెడ్డి, నల్లప్ప, వెంకటరెడ్డి,పోతులయ్య, చిదంబరమ్మ, సువర్ణమ్మ, నాగమ్మ, రమీజ, కుళ్లాయప్ప, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక టిప్పరు, లారీ పట్టివేత


పోలీసులు అదుపులోకి తీసుకున్న దృశ్యం

రాప్తాడు రూరల్: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుంచి బుధవారం ఉదయం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్, లారీని మన్నీల క్రాస్ వద్ద ఇటుకులపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బత్తలపల్లి మండలం కట్టకిందపల్లికి చెందిన విశ్వనాథనాయుడు ఇసుకను అక్రమంగా తరలించి ఓ చోట డంప్ చేస్తున్నట్లుగా ఈ సందర్భంగా పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి వాహనాల్లో అనంతపురానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో వాహనాలను సీజ్ చేసి, అక్రమ తరలింపుదారులపై కేసు నమోదు చేసినట్లు సీఐ హేమంత్‌కుమార్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సర్జన్ రమణానాయక్‌పై విచారణకు ఆదేశం

అనంతపురం మెడికల్: శస్త్రచికిత్స చేసి ఓ వివాహితను ప్రాణాపాయస్థితికి నెట్టేసిన అంశానికి సంబంధించి జీజీహెచ్ సర్జన్, ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణానాయక్‌పై సమగ్ర విచారణకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. కూడేరు మండలం హంసాయపల్లికి చెందిన వివాహిత రాధకు ఈ నెల 9న అనంతపురంలోని రామచంద్ర నగర్‌లో ఉన్న లావణ్య క్లినిక్‌లో డాక్టర్ రమణానాయక్ శస్త్రచికిత్స చేసి గర్భసంచి తొలగించారు. అయితే ఈ ఆపరేషన్ వికటించి రాధ పరిస్థితి విషమంగా మారడంతో బాధిత కుటుంబసభ్యులు ఈ నెల 24న రాత్రి లావణ్య క్లినిక్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు డాక్టర్ రమణానాయక్‌పై విచారణ చేపట్టాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. దీంతో ప్రొఫెసర్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ రంగస్వామిని విచారణ కమిటీ సభ్యులుగా నియమిస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అందరికీ పౌష్టికాహారం అందించాలి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, తదితరులు

అనంతపురం అర్బన్: ప్రతి ఒక్కరూ ఆరోగకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఈ క్రమంలో ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని అందరికీ అందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మహిళాశిశు సంక్షేమ శాఖ, సాయి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ మహోత్సవంలో ఎంపీతో పాటు కలెక్టర్ వి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. మహోత్సవంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్న పిల్లలకు అన్న ప్రసాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మాతృత్వం అనేది సృష్టిలో ప్రతి మహిళకు దేవుడు ఇచ్చిన వరమన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోషన్ మహోత్సవాన్ని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, సాయి ట్రస్ట్ నిర్వాహకులు, మాతృ మండలి సభ్యులు, సీడీపీఓలు, నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చీకట్లను పారదోలేందుకు..




చీకట్లను పారదోలడమే లక్ష్యంగా శ్రమజీవులు చెమటను చిందిస్తున్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని ఇటుకలపల్లి వద్ద గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు బుధవారం మండుటెండను సైతం లెక్క చేయకుండా కొత్త లైన్లను లాగే పనిలో నిమగ్నమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

'రింగ్' పడింది...


బత్తలపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన రింగు రోడ్డు


కదిరి మార్గంలో కొత్త రోడ్డుపై దూసుకుపోతున్న కారు

అనంతపురం–కదిరి మార్గంలోని బత్తలపల్లి వద్ద రింగ్ రోడ్డు ప్రారంభమైంది. గతంలో కదిరికి వెళ్లాలంటే బత్తలపల్లి మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకునేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బత్తలపల్లి వద్ద రింగ్ రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు పూర్తి కావడంతో బుధవారం ఆ మార్గంలో వాహనాలు దూసుకెళుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

కేతిరెడ్డిపై దాడి యత్నం దుర్మార్గం

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై టీడీపీ, బీజేపీ నాయకులు దాడికి యత్నించడంతో పాటు అక్రమంగా కేసులు బనాయించడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మవరంలో అక్రమ కేసులు బనాయించి సబ్ జైలుకు తరలించిన వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించేందుకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై టీడీపీ, బీజేపీ నాయకులు కాపుకాచి దాడికి యత్నించడం బాధాకరమన్నారు. పోలీసుల సమక్షంలోనే ఈ దారుణం జరిగిందన్నారు. రాజకీయ విద్వేషాలకు హింసా మార్గాన్ని ఎంచుకోవడం సబబు కాదని హితవు పలికారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే ప్రభుత్వంపై ప్రజలే తిరగబడుతారని హెచ్చరించారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: రైతు కుమ్మర సూర్యనారాయణ ఆత్మహత్యకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించి, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వ్యక్తి ఆత్మహత్య


గోపాల్ (ఫైల్)

గుత్తి: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం ఉదయం తురకపల్లి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

- జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ శైలజకుమారి


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శైలజ కుమారి

వజ్రకరూరు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ శైలజ కుమారి సూచించారు. ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్‌తో కలసి బుధవారం వజ్రకరూరు మండలం గడేహోతూరు, పొట్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. గడేహోతూరులో రైతు తిప్పారెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. డ్రోన్‌ల వినియోగంపై చైతన్య పరిచారు. రాయితీతో ప్రభుత్వం అందజేస్తున్న బిందు, తుంపర సేద్యం పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఏఓ మధుకర్, హెచ్‌ఓ నెట్టికంటయ్య, సర్పంచ్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజం
- కర్నూలులోని లా యూనివర్శిటీ, కొప్పర్తిలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలింపు
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మొండి చెయ్యి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: కర్నూలులో ఏర్పాటు కావాల్సిన లా యూనివర్సిటీ, వైఎస్సార్ జిల్లా కొప్పర్తికి కేంద్రం మంజూరు చేసిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని బలవంతంగా అమరావతికి తరలించి రాయలసీమ ద్రోహిగా సీఎం చంద్రబాబు మారారని ఉరవకొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. అమరావతిని అభివృద్ధి చేయాలన్న ఆకాంక్షతో రాయలసీమ, ఇతర వెనుకబడిన ప్రాంతాలకు ద్రోహం చేయడం సబబు కాదని హితవు పలికారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రాంతీయ సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని వెనుకబడిన రాయలసీమలో లా వర్సిటీ, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు అప్పటి సీఎం వైఎస్ జగన్ చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. ఓర్వకల్లు, కొప్పర్తిను అభివృద్ధి చేయడానికి గత ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేసిందన్నారు. ప్రస్తుతం వీటిని అమరావతికి తరలించి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు గండి కొట్టారని మండిపడ్డారు.

విద్య, వైద్యం ప్రైవేటీకరణకు కుట్ర

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను ప్రైవేట్ పరం చేసే కుట్ర సాగుతోందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగు వేస్తోందని విశ్వ అన్నారు. ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు అప్పటి సీఎం వైఎస్ జగన్ అనుమతులు సాధించారన్నారు. ఇందులో ఐదు వైద్య కళాశాలలను కూడా ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ ఏడాది ఆయా కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల భర్తీని వ్యతిరేకిస్తూ ఎన్ఎంసీకి చంద్రబాబు సర్కార్ లేఖ రాసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందకుండా చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రూ.70వేల కోట్లను ఖర్చుపెట్టారన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వెయ్యి స్కూళ్లలో సీబీఎస్ఈ రద్దు చేశారన్నారు. సీఎం చంద్రబాబు విధానాల కారణంగా 2 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారన్నారు. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు రాకెట్ల అశోక్, బెస్త రమణ, సీపీ వీరన్న, బెళుగుప్ప నాయకులు శివలింగ, త్రిలోక్‌నాథ్, సర్పంచులు లక్ష్మీబాయి, కేశవరెడ్డి, వంశీ, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం: సీఐ(సివిల్)లను బదిలీ చేస్తూ డీఐజీ డాక్టర్ షిమోషి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో టి.నాగమణి, షేక్ జాకీర్ ఉన్నారు. వీఆర్‌లో ఉన్న నాగమణికి అనంతపురం సీసీఎస్, వీఆర్ఎస్‌పీ–1లో ఉన్న షేక్ జాకీర్‌కు సోషల్ మీడియా/సైబర్ క్రైమ్ కేటాయించారు.

వ్యక్తి బలవన్మరణం


శేషు (ఫైల్)

పెద్దవడుగూరు: స్థానిక నరసింహస్వామి కాలనీలో నివాసముంటున్న శేషు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య శివమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ పోషణ, ఇతర అవసరాలకు బంధువులు, స్నేహితుల వద్ద దాదాపు రూ.5లక్షల వరకూ అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరాక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన స్నేహితులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం పామిడికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు.

తాగునీటి సరఫరా కార్మికుడిపై టీడీపీ నేతల దాడి


చికిత్స పొందుతున్న రాంబాబు

గుంతకల్లు రూరల్: తాగునీటి సరఫరా కార్మికుడిపై స్థానిక టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు... గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా విభాగంలో వాటర్‌మెన్‌గా రాంబాబు పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా రోజూ ఉదయం 9 నుంచి 9.30 గంటల్లోపు కొళాయిలకు నీరు సరఫరా అయ్యేలా చేసేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పంచాయతీ బోరు బావికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ స్టార్టర్ పెట్టెలో నీరు చేరింది. బుధవారం ఉదయం మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లిన సమయంలో ఈ విషయాన్ని గుర్తించిన రాంబాబు... అంతా శుభ్రం చేసి మోటార్ ఆన్ చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎగిరి పోతున్న ఫ్యూజ్‌లను ఎన్ని సార్లు మార్చినా ఫలితం లేకపోయింది. దీంతో విషయాన్ని వెంటనే ఎలక్ట్రీషియన్‌కు తెలిపి, మరమ్మతు చేయాలని కోరాడు. అదే సమయంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి ఫోన్ చేసి తాగునీటి సరఫరా అంశంపై ఆరా తీయడంతో స్టార్టర్‌లో నీరు చేరి ఇబ్బంది పెడుతున్న విషయాన్ని రాంబాబు తెలిపాడు. ఎలక్ట్రీషియన్ రాగానే మరమ్మతు చేయించి నీటిని వదులుతానని తెలిపాడు. అదే సమయంలో పంచాయతీ కార్యదర్శి పక్కనే ఉన్న టీడీపీ నాయకులు ఫోన్ లాక్కొని రాంబాబును దుర్భాషలాడారు. ఎమ్మెల్యే వస్తుంటే నీళ్ల వదలకుండా ఇబ్బంది పెడుతున్నావంటూ బూతులతో విరుచుకుపడ్డారు. అంతటితో ఆగకుండా టీడీపీ కార్యకర్తలు సురేంద్ర, ధన, రమేష్ దౌర్జన్యంగా రాంబాబు ఇంట్లోకి చొరబడి అతన్ని పట్టుకుని బయటకు ఈడ్చుకెళ్లారు. ఒకరు చేతులు వెనక్కు విరిచి పట్టుకుంటే మరొకరు ఇటుక పెళ్లతో దాడి చేశారు. అదే సమయంలో ఇంకో వ్యక్తి గునపంతో పొడవబోతుండగా రాంబాబు భార్య నాగమణి అడ్డుకుంది. దీంతో మహిళ అని కూడా చూడకుండా ఆమెను పక్కకు ఈడ్చి పడేశారు. ఘటనలో రాంబాబు తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. నాగమణికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప తెలిపారు.

అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

- 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను అరెస్ట్ చేసి, వారి నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు. తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. తాడిపత్రి మండలం వెంకటాంపల్లి సమీపంలోని పొలం వద్ద రైతు వెంకట ప్రసాద్ తన ద్విచక్ర వాహనాన్ని ఆపి సేద్యం పనుల్లో నిమగ్నమైనప్పుడు ఓ దుండగుడు బైక్‌ను అపహరించుకెళ్లాడు. విషయాన్ని గుర్తించిన వెంకటప్రసాద్, మరికొందరు రైతులు వెంటనే వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం పట్టుబడిన వ్యక్తిని నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోనపాడు గ్రామానికి చెందిన నాగరాజుగా పోలీసులు గుర్తించారు. తాను, కోనపాడుకు చెందిన వెంకటేశ్వర్లు కలిసి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారమని నాగరాజు తెలిపాడు. దీంతో వెంకటేశ్వర్లునూ పోలీసులు అదుపులోకి తీసుకుని లోతైన విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సజ్జలదిన్నె సమీపంలో దాచిన 8 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

అనంతపురం: ఈ నెల 28న బాపట్లలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లను బుధవారం ఎంపిక చేశారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో చేపట్టిన ఈ ప్రక్రియకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో సుధీర్, తన్విత్, ఆకాష్, వినయ్, అరవింద్, దినేష్, మోహన్, పవన్, జశ్వంత్, శ్రీహరి, యశ్వంత్ కుమార్, జ్యోతిర్, ఆదిత్య, హేమంత్, నవీన్, రితిక్ రెడ్డి, కేసీ యోగేష్, టీఆర్ పునీత్ కుమార్, బి. ధనుష్ కుమార్ చోటు దక్కించుకున్నారు. బాలికల జట్టుకు ప్రణతి, వర్షా, అఖిల, అక్షిత, హాసిని, శిల్పా, యామిని, స్వాతి, హర్షవల్లి, రూప, మన్విత, పూజిత, రమ్య, కే. పూజిత, భార్గవి, యశస్విని, భవ్యశ్రీ ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ బి. సుగుణమ్మ, డి.మొరార్జీ యాదవ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, కుల సంఘాల ముసుగులో దందా

- ఎస్పీతో మొరపెట్టుకున్న ప్రైవేట్ పాఠశాలల సంఘం ప్రతినిధులు


ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏడీపీఎస్‌ఏ నాయకులు

అనంతపురం/ఎడ్యుకేషన్: విద్యార్థి, కులసంఘాల ముసుగులో కొందరు యువకులు తమను బెదిరించి డబ్బు డిమాండ్ చేస్తున్నారంటూ ఎస్పీ జగదీష్ ఎదుట జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (ఏడీపీఎస్ఏ) నాయకులు వాపోయారు. ఈ మేరకు బుధవారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసి, మాట్లాడారు. కొందరు యువకులు విద్యార్థి, కుల సంఘాల నాయకులమంటూ బెదిరించి, చందాల రూపంలో డబ్బును డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇందుకు నిరాకరిస్తే స్కూల్‌లో వసతులు సరిగా లేవని కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. వీరి తీరుతో చిన్నపాటి విద్యాసంస్థల నిర్వాహకులు చాలా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ... విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో ఏడీపీఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గోపాలరెడ్డి, నాయకులు రమణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రవిచంద్రారెడ్డి, రామచంద్ర, రాఘవేంద్ర, శ్రీవాత్సవ కుమార్, భాస్కర్ రెడ్డి, విజయ్ కుమార్, జానకి రాములు, రఫీ, రాజారమేష్, మల్లోబన్న, కొండారెడ్డి, శ్రీధర్ ఉన్నారు.

ఎస్కేయూలో బైక్ రేసింగ్ కలకలం

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బైక్ రేసింగ్ కలకలం రేపింది. రోజూ అర్ధరాత్రి ద్విచక్ర వాహనాలపై ప్రమాదకర విన్యాసాలతో చెలగాటమాడుతున్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం రేసింగ్‌లో కిందపడి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న ఇంటర్నెట్ కేబుల్‌ను ఆకతాయిలు తొలగించడంతో ఫిజికల్ ఎడ్యుకేషన్, లా, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, సెరికల్చర్, బయో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్సెస్, ఇంజినీరింగ్ విభాగాలకు ఇంటర్నెట్ సదుపాయం లేకుండా పోయింది. దీంతో వారం రోజులుగా కంప్యూటర్ ల్యాబ్ జరగక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

18 మందికి బదిలీ

ఎస్కేయూలోని బోధనేతర ఉద్యోగులను బుధవారం బదిలీ చేశారు. డిప్యూటీ రిజిస్ట్రార్ నుంచి రికార్డు అసిస్టెంట్ వరకూ మొత్తం 18 మందికి స్థాన చలనం కలిగిస్తూ రిజిస్ట్రార్ రమేష్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇష్టారాజ్యంగా బస్‌షెల్టర్లు

- నగరంలో అడ్డదిడ్డంగా 10 బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తున్న ఓ యాడ్ ఏజెన్సీ
- బస్సులు తిరగని ప్రాంతంలో బస్‌స్టాప్‌లు
- ప్యాకేజీ మాట్లాడుకుని అడ్డగోలు బాగోతానికి తెరలేపిన టీడీపీ నాయకులు



నగరంలోని జడ్జి బంగ్లా ముందు ఏర్పాటు చేస్తున్న బస్‌షెల్టర్



ఇది వరకే ఎస్‌ఎస్‌ఎస్ కళాశాల ముందు ఫుట్‌పాత్‌పై ఉన్న బస్‌షెల్టర్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అవినీతి చాపకింద నీరులా ప్రవహిస్తోంది. అధికార పార్టీకి చెందిన నేతలకు ముడుపులు సమర్పిస్తే టవర్‌క్లాక్ మీద కూడా అక్రమ నిర్మాణాలు చేసుకోవచ్చన్న చందంగా దారుణమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల నగరంలో ఓ యాడ్ ఏజెన్సీ అడ్డదిడ్డంగా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మొదట్లో ఈ బస్‌షెల్టర్ల ఏర్పాటుకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అభ్యంతరం చెబితే.. అధికార పార్టీ నాయకులు ఆశీస్సులతో ఏజెన్సీ నిర్వాహకుడు ఇష్టానుసారంగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తున్నారు.

బాలికల కళాశాలల ముందు బస్‌షెల్టర్

ఇది వరకే ఎస్‌ఎస్‌ఎస్ కళాశాల ముందు బస్‌షెల్టర్ ఉండగా.. అదే మార్గంలో జడ్జి బంగ్లా ఎదురుగా బస్‌షెల్టర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.10 లక్షల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై బస్‌షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవంగా ఇటువైపు ఎటువంటి బస్సులు వెళ్లవు. అదేవిధంగా నగరంలోని కోర్టు రోడ్డులోనే మూడు బస్‌షెల్టర్లు, డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద, దాని పక్కనే నెహ్రూ బాలభవన్ వద్ద, కలెక్టరేట్, జెడ్పీ వద్ద మొత్తం కలుపుకుని పది బస్‌షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తే సదరు అడ్వటైజ్‌మెంట్ ఏజెన్సీ రూ.25,600 నగరపాలక సంస్థకు చెల్లించేలా కాగితాలపై రాసుకున్నారు. వాస్తవంగా టెండర్ ద్వారా వీటిని నిర్వహించాలి. కానీ అధికార పార్టీ నేతల అండదండలతో యథేచ్ఛగా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. జడ్జి బంగ్లాకు అత్యంత సన్నిహితంగా ఉండే ప్రాంతంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడం వెనుక సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రంగంలోకి ప్రైవేట్ సైన్యం..

ఓ ఏజెన్సీకి బస్‌షెల్టర్ల ఏర్పాటు పనులు అప్పజెప్పేందుకు అధికార పార్టీకి చెందిన ప్రైవేట్ సైన్యం రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఏజెన్సీ నిర్వాహకులతో ప్రైవేట్ సైన్యం ప్యాకేజీ మాట్లాడుకుని ఈ అడ్డగోలు బాగోతానికి తెరలేపినట్లు సమాచారం. అవసరమైన ప్రాంతాల్లో బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయకుండా కేవలం ఆకతాయి కుర్రాళ్లు కూర్చుని బాతాకానీ కొట్టేందుకు షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయినా అధికార పార్టీకి చెందిన ప్రైవేట్ సైన్యానికి డబ్బు సమర్పిస్తే ఎక్కడైనా నిర్మాణాలు చేసుకోవచ్చన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇదే విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజును సంప్రదించగా.. ఆయన ఏసీపీ మారుతీ ప్రసాద్‌తో మాట్లాడమన్నారు. ఏసీపీ మారుతీప్రసాద్‌ను సంప్రదించగా.. జడ్జి బంగ్లా వద్ద షెల్టర్ ఏర్పాటు చేయకూడదని చెప్పామన్నారు. అయితే ఎందుకు నిర్మిస్తున్నారో అర్థం కావడం లేదని సాక్షికి తెలిపారు.

క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఆత్మకూరు: పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు విధిగా ఆలయ నిబంధనలు పాటించాలని సూచించారు.

పండిట్ దీన్ దయాళ్ జయంతి

అనంతపురం టవర్‌క్లాక్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. బుదవారం స్థానిక బీజేపీ కార్యలయంలో పండిట్ దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయను ఆదర్శంగా తీసుకుని నరేంద్ర మోదీ పాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కిరణ్ గౌడ్, అశోక్ రెడ్డి, ఈశ్వర్, ప్రసాద్, మల్లిక, వెంకటేష్, నాగరాజు, రాజేష్, సూర్య ప్రకాష్, అనంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన అవసరం



తలుపూరు వద్ద రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: రైతులు తాము సాగు చేస్తున్న పంటలపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత సూచించారు. బుధవారం మండలంలోని పి.యాలేరు, తలుపూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పంటలు సాగు చేసే సమయంలో, మందులు పిచికారీ చేసే సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేస్తే రైతులకు పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి వస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో తలుపూరు సర్పంచ్ ఓబులేష్, ఎంపీటీసీ ఓబులేసు, ఏఈఓ సుజిత తదితర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల షెడ్యూల్‌కు ఆమోదం

అనంతపురం: డిగ్రీ, పీజీ విద్యార్థులకు క్రీడాంశాలపై ఆసక్తి పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లను ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనిత ఆదేశించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యంగా వర్సిటీ స్థాయిలో క్రీడలు పెరగాలని కోరారు. అంతర కళాశాలల వార్షిక క్రీడా పోటీల షెడ్యూల్‌కు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ బి.జెస్సీ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలు కల్పించండి



కియా ప్రతినిధులతో సమావేశమైన ఇన్‌చార్జ్ వీసీ హెచ్.సుదర్శన రావు

అనంతపురం: కియా పరిశ్రమలో జేఎన్‌టీయూ (ఏ) విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు కోరారు. బుధవారం కియా ప్రతినిధులు వర్సిటీని సందర్శించారు. సీమెన్స్ ల్యాబ్స్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కియా పరిశ్రమలను సందర్శించడానికి అధ్యాపకులు, విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ ప్రొఫెసర్ ఎస్.దేవన్న, కియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

29న టెట్ హిందీ మోడల్ టెస్ట్

అనంతపురం ఎడ్యుకేషన్: హిందీ సేవా సదన్ ఆధ్వర్యంలో ఏపీ టెట్ హిందీ ఆన్‌లైన్ మోడల్ పరీక్షను ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 29న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు హిందీ సేవా సదన్ యాప్‌లో ఈ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబరు 5న ప్రభుత్వం నిర్వహిస్తున్న టెట్ హిందీ పరీక్ష రాయబోయే అభ్యర్థులకు ఈ మోడల్ టెస్ట్ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పరీక్ష విధానం, సమయపాలన మీద సంపూర్ణ అవగాహన కలుగుతుందని తెలిపారు. అభ్యర్థులందరూ హిందీ సేవాసదన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 95813 86150, 95536 77119, 98487 83787 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'ఎమ్మెల్యే దగ్గుపాటికి నాలెడ్జ్ లేదు'



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు బేసిక్ నాలెడ్జ్ లేదు. కనీసం అవగాహన లేకుండా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పాలకవర్గంపై విమర్శలు చేయడం సరికాదు. ఆధారాలతో సహా విమర్శలు చేస్తే బాగుంటుందని మేయర్ వసీం హితవు పలికారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఇప్పుడు టీడీపీ వంద రోజుల పాలనలో ఎమ్మెల్యే దగ్గుపాటి ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడమే కాకుండా.. అభివృద్ధికి అడ్డుగా నిలుస్తున్నారని ఆరోపించారు. నగరపాలక సంస్థలో రూ.13.80 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయి నెలలు గడుస్తున్నా.. ఎందుకు ఆగిపోయాయో చెప్పాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రస్తుత టీడీపీ వంద రోజుల పాలన వ్యత్యాసాన్ని వివరించారు. గత ప్రభుత్వంలో కార్మికుల పనిముట్లకు వెచ్చించిన రూ.1.6 కోట్లలో అవినీతి జరిగిందంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వారిదే ఉందని.. విచారణ చేపట్టి నిజంగా అవినీతి జరిగి ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి గతంలోనే తాము డీపీఆర్ సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటే.. వంద రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేశామంటూ ప్రచారం చేసుకునే దౌర్భాగ్య స్థితికి చేరుకున్నారని మండిపడ్డారు. ఎవరో చెప్పిన మాటలకు మైకుల ముందు మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, మల్లెమీద నరసింహులు, సైపుల్లాబేగ్, ఇసాక్, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, సంపంగి రామాంజనేయులు, నాయకులు కుళ్లాయస్వామి, రామచంద్ర, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, రులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి



ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

రాప్తాడు/అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి. నూతన ప్రయోగ ఆవిష్కరణలను రేకెత్తించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ పేర్కొన్నారు. ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలన్నారు. సృజనాత్మకతను పెంచి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి నూతన ప్రయోగ ఆవిష్కరణలకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. దొంగ బాబాలు చేసే మోసాలకు బలి కాకూడదని తెలిపారు. ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయిలో జరుగుతుందని పేర్కొన్నారు. రాప్తాడు మండలంలో 9 పాఠశాలల్లో జరిగిన ఈ టెస్ట్‌లో దాదాపు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నరన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అమల, శాస్త్ర ప్రచారకులు ప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మధురగీతాలు



ఆఫీసర్స్ క్లబ్‌లో పాటలు పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్: దివంగత సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సుమధుర గీతాలతో పలు కళావేదికలు పులకరించిపోయాయి. ఎస్పీబీ 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక ఆఫీసర్స్ క్లబ్ వేదికగా సంగీత స్వరాంజలి వారు ఆ పాత మధుర గీతాలతో గానగాంధర్వుడికి నివాళులర్పించారు. ముఖ్యంగా సీనియర్ గాయకుడు కేవీ మహీధర్ ఆలపించిన 'మా బాలుడా' విషాద గీతం అందరినీ మైమరపించింది. అలాగే ఆదిశేషు, శ్రీదేవి రమణ, ఫణిశయనం, రమణ తదితరులు బాలసుబ్రహ్మణ్యం సినీ జీవితంలోని పలు పాటలను, సంఘటనలను రాగయుక్తంగా పంచుకున్నారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక భవనంలో పాతపాటల ప్రేమికుల సంఘం ప్రతినిధులు ఓబుళదాసు, జీవీ రామయ్య నేతృత్వంలో పలువురు గాయనీ గాయకులు బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన పాటలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఆచార్య సుధాకర బాబు, నరసింహులు తదితరులు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలకే కాకుండా యావత్ భారతదేశానికి పరిచయం అక్కరలేని సంగీత ప్రియుడు బాలసుబ్రహ్మణ్యం మనవాడు కావడం గర్వకారణమన్నారు. ఆయన ఆశయాలను విస్తృతంగా వ్యాప్తి చేయడానికి చిన్నారులు, యువతను సంగీతంలో ప్రోత్సహించాలన్నారు.

జమిలీ ఎన్నికలపై చర్చ అవసరం



మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

అనంతపురం కల్చరల్: ఎన్నికలొచ్చాయంటే ప్రజాస్వామ్యం నడివీధిన పడుతూ పరిహాసమవుతోందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. జేవీవీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సందర్భం సమాలోచన కార్యక్రమం ఆలోచనాత్మకంగా సాగింది. కార్యక్రమ కన్వీనర్ తిరుపాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జమిలీ ఎన్నికలు-ప్రభావం, పరిమాణాలు అనే అంశంపై విస్తృతస్థాయి చర్చ జరిగింది. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్‌తో పాటూ మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం బాషా, యూటీఎఫ్ నాయకులు జిలాన్, భాస్కర్ తదితరులు మాట్లాడారు. ఎన్నికలంటే స్వేచ్ఛాయుత వాతావరణం వెళ్లిపోయి విచ్చలవిడిగా డబ్బు కీలక పాత్రపోషిస్తుండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకారిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లకొకసారి అన్నిచోట్ల ఒకేసారి ఎన్నికలంటే తప్పులు జరిగిన చోట అవిశ్వాస తీర్మానం లాంటి వాటికి చోటే ఉండదన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను అపహాస్యం చేస్తూ రాష్ట్రపతి పాలన విధిస్తారా అని వక్తలు ప్రశ్నించారు. అలాగే పలువురు వక్తలు జమిలి ఎన్నికల విధానంపై విస్తత చర్చ సాగాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని చట్టంగా తేవాలన్నారు. ఎన్నికల సజావుగా సాగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు జేవీవీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్బన్ లింక్ రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ



రహదారి విస్తరణను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఎన్‌హెచ్-42 అర్బన్ లింక్ రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టేలా ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఎన్‌హెచ్-42 లింక్ రోడ్డు పనులను మేయర్ వసీంతో కలసి పరిశీలించారు. రోడ్డుకు సంబంధించి నమాజ్ కట్టా మసీద్, నితిన్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ఎంత మేరకు భూసేకరణకు భూములు వెళ్తున్నాయో ఆరా తీశారు. రోడ్డు అలైన్‌మెంట్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. నగరంలోని కేఎం.0.000 నుంచి 9.2000 వరకు ఎన్‌హెచ్-42 అర్బన్ లింక్‌లో రహదారి విస్తరణకు సంబంధించి ఇందులో సర్వే నంబర్ 1947/18, విస్తీర్ణం 12.671 సెంట్లు, సర్వే నెంబర్ 2022/3ఏ2, షాపింగ్ కాంప్లెక్స్‌తో కూడిన 7.334 సెంట్లు సప్తగిరి సర్కిల్‌ఓని ఈద్గా మసీదు (నమాజ్ కట్టా మసీదు)ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వసంత బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మారంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: ఫార్మసీ రంగంలో విస్తృతంగా ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పేర్కొన్నారు. వర్సిటీలోని ఫార్మసీ విభాగంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో అంతర్జాతీయ ఫార్మసిస్టు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చౌకగా లభ్యమయ్యే నాణ్యమైన ఔషధాలను ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ రమేష్ రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చేతివాటం!

- రహమత్ నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో అడ్డగోలు వసూళ్లు
- సొమ్ము చేసుకుంటున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో తమ్ముళ్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అందినకాడికి దోచేసుకుందామనే ధోరణిలో అధికార పార్టీ నాయకులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నాయకులకు అండగా ఉంటే తమ జేబులు కాసింతైనా నిండుతాయనే యోచనలో టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. రహమత్ నగర్‌లోని ఇటీవల అడ్డగోలుగా నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌కు జీప్లస్-1 అనుమతులు తీసుకుని అదనంగా మరో ఫ్లోర్ ఏర్పాటు చేయడంతో పాటు ఎటువంటి సెట్ బ్యాక్స్ లేకపోవడం, సన్‌షైడ్ ముందుకు రావడం, కాలువపై నిర్మాణం చేపట్టారు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులే పిల్లర్లు తొలగించారు. ఇటీవల కాలంలో నెలల తరబడి రెండో ఫ్లోర్ నిర్మాణం జరిగింది. అంత వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు తొంగి చూడలేదు. విమర్శలు తలెత్తడంతో ఈనెల 23న నిర్మాణదారుడి వద్దకు వెళ్లి తూతూమంత్రంగా షో చేశారు.

నిర్మాణంపై చర్యలేవి?

వాస్తవంగా రోడ్డు, కాలువకు పది అడుగుల దూరంలో ఏమైనా చిన్నపాటి నిర్మాణాలు చేపడితే టౌన్ ప్లానింగ్ అధికారులు ఆగమేఘాలపై వచ్చి అక్రమణల పేరుతో కూలగొడతారు. అటువంటిది నిబంధనలకు విరుద్ధంగా అదనపు ఫ్లోర్ వేసినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

రూ.లక్షల్లో లావాదేవీలు

ఈ అక్రమ నిర్మాణం వెనుక టౌన్ ప్లానింగ్‌లోని ఓ మహిళా అధికారి చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో నిర్మాణం చేపట్టే సమయంలోనే సదరు అధికారి డ్రైవర్ నిర్మాణదారుడితో లావాదేవీలు నడిపినట్లు సమాచారం. మరోమారు తన భవనాన్ని ముట్టుకోకూడదని ఒప్పందం చేసుకుని సదరు మహిళా అధికారి రూ.లక్షల్లో తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పుడు అదనపు ఫ్లోర్‌కు వాటా రాకపోవడంతో అధికార పార్టీకి చెందిన ప్రైవేట్ సైన్యం రంగంలోకి దిగడంతో కథ అడ్డం తిరిగింది. అధికార పార్టీ నాయకులకు రూ.లక్షల్లో ముట్టచెప్పడంతో అదనపు ఫ్లోర్ నిర్మాణానికి అడ్డంకులు లేకుండా పోయాయి.

ముగ్గురు ఎస్‌ఐల బదిలీ

అనంతపురం: జిల్లాలో ముగ్గురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధరణి బాబును తనకల్లు పోలీస్ స్టేషన్ నుంచి తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు, సురేష్ (అనంతపురం వీఆర్)ను గుత్తికి, గంగాధర్ (శ్రీ సత్యసాయి వీఆర్)ను పామిడి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో రిపోర్ట్ చేసుకోవాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి ఇక్కడికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. రాత్రి సమయంలో డాక్టర్ అందుబాటులో ఉండాలన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ప్యాదిండి చెన్నేకొత్తపల్లి, హరియాన్ చెరువు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం భూమిపూజ చేశారు. మండలంలో రూ.3.60 కోట్ల సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చందమూరు గ్రామం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని అధికారులకు సూచనలు చేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

రాప్తాడు: చౌక దుకాణాల్లోని నిత్యావసరాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ విజయకుమారి డీలర్లను హెచ్చరిచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్లు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎవరికైనా సరిగా పంపిణీ చేయలేదని ఫిర్యాదు అందితే, డీలర్ షిప్ రద్దు అవుతుందని హెచ్చరించారు. కార్డుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తెలిపారు. చౌక డిపోల్లో తూకాల్లో మోసం చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్డుదారులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా డీలర్లు అధిక ధరలకు పంపిణీ చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ జ్యోతి, డీలర్లు పాల్గొన్నారు.

30న సొసైటీ సర్వసభ్య సమావేశం

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఈనెల 30వ తేదీన 3 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సబ్ డివిజినల్ కో-ఆపరేటివ్ అధికారి, సొసైటీ పీఐసీ బాల గంగాధర్, సీఈఓ బ్యాళ్ల నారాయణ తెలిపారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సొసైటీలో సభ్యత్వం ఉన్న వారు ఈనెల 30 లోపు ఈ-కేవైసీ వివరాలు చెక్ చేయించుకోవాలన్నారు. లేని పక్షంలో ఎన్నికల అర్హత కోల్పోతారన్నారు. అదే విధంగా రుణమాఫీ, పంటల బీమా, నష్ట పరిహారం వర్తించదన్నారు. రైతులందరూ తప్పకుండా ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార సంఘం రికార్డులన్నీ (కంప్యూటీకరణ) ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్, పట్టా పాసు పుస్తకం, వన్‌బీ, అడంగల్ జిరాక్స్ కాపీలతో పాటు ఫోన్ నంబర్, నామినీ వివరాలు, 3 ఫోటోలను సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు (ఆయా) పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, హేమలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాప్తాడు, బొమ్మేపర్తి, మరూరు గ్రామాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. రాప్తాడు-3 అంగన్‌వాడీ కేంద్రంలో ఓపెన్, బొమ్మేపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో ఓపెన్, మరూరు-3 అంగన్‌వాడీ కేంద్రంలో ఓపెన్ కేటగిరీకి రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అనంతపురం రూరల్ సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 21 ఏళ్లు పూర్తయి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. ఏ పోస్టుకైనా పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. విద్యార్హత, కుల, నివాస ధ్రువపత్రాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి, దరఖాస్తుకు జత చేయాలని సూచించారు.

'విద్యుత్ తీగలను సరి చేశారు'



కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి, విద్యుత్ తీగలను సరిచేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: రాప్తాడు పంచాయతీలోని ముస్లిం, మైనార్టీ కాలనీలో మసీదు ఎదురుగా ఉన్న వీధిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ తీగలు ఇంటి ముందు చేతికందే ఎత్తులో ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై ఈనెల 24వ తేదీన సాక్షి దినపత్రికలో 'తగిలితే షాకే' శీర్షికతో కథనం వెలువడింది. స్పందించిన ట్రాన్స్‌కో సిబ్బంది బుధవారం ముస్లిం, మైనార్టీ కాలనీకి చేరుకున్నారు. కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి, ఇంటి ముందు వేలాడుతున్న తీగలను సరిచేశారు. చేతి కందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు ఇంటి పైభాగాన వెళ్లడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.